క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: కానూరులో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ పి.హరిబాబు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామన్నారు. సనత్‌నగర్, బందరురోడ్డు ప్రాంతంలోనూ సరఫరా ఉండదన్నారు. పోరంకి సెక్షన్‌లో సైతం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు, గ్రామంలో పెనమలూరు సెంటర్, శ్రీనివాసానగర్, ప్రభునగర్, రామాపురంకాలనీ, డొంకరోడ్డులో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఫైర్ స్టేషన్ తనిఖీ



ఆటోనగర్ (విజయవాడతూర్పు): జవహర్ ఆటోనగర్‌లోని అగ్ని మాపక కేంద్రాన్ని రీజనల్ ఆఫీసర్ ఈ. స్వామి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని పరికరాలను, రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ కృష్ణాజిల్లా కంకిపాడులో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో గతం కన్నా 20 శాతం ప్రమాదాలు తగ్గాయన్నారు. ఈ ఆరు నెలల కాలంలో 1356 ఫోన్ కాల్స్ వచ్చాయన్నారు. రూ.13.58 కోట్లు ఆస్తిని కాపాడినట్టు చెప్పారు. నష్టం రూ.6.6 కోట్లు అని ఆయన చెప్పారు. ఏలూరు, కంకిపాడు, రాజమండ్రితోపాటు భీమవరంలో ఒక్కొక్క అగ్నిమాపక కేంద్రాన్ని రూ. 5కోట్లతో నిర్మించనున్నట్లు చెప్పారు. అనంతరం సిబ్బందికి బూట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి నరేష్, సిబ్బంది ఉన్నారు.

సమగ్రంగా ఓటర్ల సర్వే

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో ఓటర్ల సర్వే సమగ్రంగా నిర్వహించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం పోరంకి, తాడిగడప, యనమలకుదురు ప్రాంతాల్లో సూపర్‌వైజర్లు, బూత్‌లెవల్ అధికారులకు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో ఉన్న ఓటర్ల వివరాలు సర్వే చేయాలన్నారు. మృతి చెందిన ఓటర్లు, డబుల్ ఎంట్రీలు ఉంటే గుర్తించి ఓట్లు తొలగించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలన్నారు. కమిషనర్ ఎన్.ప్రకాశరావు, అసిస్టెంట్ కమిషనర్ అవినాష్, బీఎవోలు పాల్గొన్నారు.

పెనమలూరులో చోరీ

పెనమలూరు: తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరగటంతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు చెరువుకట్ట పై రైల్వే ఉద్యోగి దాసరి శివకృష్ణ, భార్య శివకోటేశ్వరి ఉంటున్నారు. అయితే గురువారం భర్త ఉద్యోగానికి వెళ్లగా భార్య ఇంటికి తాళం వేసి కంకిపాడులో బంధువుల ఇంటికి వెళ్లింది. ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయని బంధువుల వ్యక్తి వాళ్లకి తెలిపాడు. దీంతో భార్యాభర్తలు వచ్చి చూడగా గుర్తు తెలియని దొంగలు ఇంటి తాళాలు పగులకొట్టి ఇంట్లో ఉన్న రూ.2 లక్షలు విలువ చేసే బంగారు అభరణాలు, రూ. 20 వేల సొమ్ము చోరీ చేశారని గుర్తించారు. క్లూస్‌టీం వచ్చి వేలిముద్రలు సేకరించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఏడు నామినేషన్లు ఖరారు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో 9వ వార్డు ఉప ఎన్నికకు ఏడు నామినేషన్లు ఖరారు చేసినట్లు రిటర్నింగ్ అధికారి సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం నామినేషన్ల స్క్రూట్నీ తర్వాత ఏడింటిని ఫైనల్ చేశామని తెలిపారు. దండు సుబ్రహ్మణ్యంరాజు, గుంటక సుబ్బారెడ్డి, వల్లూరి వెంకటశివ, ఆరేపల్లి ప్రవీణ్, ఆరేపల్లి ప్రశాంత్, బొమ్మిన శ్రీనివాసరావు, పోలారెడ్డి దర్గారెడ్డి నామినేషన్లు వేశారన్నారు.

పేరంటాలమ్మకు అర్చన

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో అధిక శ్రావణమాసం, బహుళ దశమి ఏకాదశి పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం అమ్మవార్లకు సహస్ర పద్మములతో అర్చన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పలు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో మహిళా భక్తులు హాజరై సామూహిక పూజల్లో పాల్గొన్నారు. అమ్మవారికి ప్రీతికరమైన పద్మములతో సహస్ర అర్చన నిర్వహించారు. ఈవో పి. లోకేశ్వరి, ఆలయ చైర్మన్ బోయిన భాను ప్రదీప్ పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదుతోనే ప్రభుత్వ పథకాలు

నున్న: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అమలు చేస్తున్న పథకాలు పొందాలంటే పంటలను సాగు చేసే ప్రతి రైతు ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని ఇన్‌చార్జి వ్యవసాయాధికారి కె.రఘురామ్ అన్నారు. శుక్రవారం నున్న గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి అధ్యక్షత సలహా మండలి సమావేశం జరిగింది. మండలంలోని అన్ని గ్రామాల్లో రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. పశుసంవర్ధక శాఖ వైద్యులు ప్రసన్న ఉద్యానశాఖ అధికారి పరమేశ్వరరెడ్డి మాట్లాడారు.

ప్రశాంతంగా ఫిషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీ ఎన్నికలు

కంకిపాడు: ఫిషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలోని మద్దూరు, గొడవర్రు గ్రామాల్లోని ఫిషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీ ఎన్నికల ప్రక్రియ శుక్రవారం చేపట్టారు. మద్దూరు ఫిషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీ పాలకవర్గానికి రాజకీయాలకు అతీతంగా ఒకే ప్యానల్ నామినేషన్లను దాఖలు చేసింది. దీంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. సొసైటీ అధ్యక్షుడుగా వల్లభుని సురేష్, ఉపాధ్యక్షుడుగా మోపిదేవి కొండలరావు, కార్యదర్శిగా తమ్మా నరసింహారావు, డైరెక్టర్లుగా అవనిగడ్డ పెద్ద నరసింహారావు, సిహెచ్ రాజు, తమ్మా సుబ్రమణ్యం, ఎన్.నాగరాజు, పీతా నాగభూషణం, వి.దేవునిదయ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మత్స్యశాఖ ఏడీ ఎన్.వెంకటేశ్వరరెడ్డి ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. పాలకవర్గ ప్రతినిధులకు నియామక ఉత్తర్వులు అందించారు. నూతన పాలకవర్గాన్ని సర్పంచ్ చిప్పల రామదాసు, ఎంపీటీసీ వడుగు శ్రీనివాసరావు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో వల్లభుని నరేంద్ర, పీతా చెన్నకేశవరావు పాల్గొన్నారు.

గొడవర్రు సొసైటీ అధ్యక్షుడిగా కొప్పుల భాస్కర్‌రావు...

గొడవర్రు ఫిషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీ ఎన్నికలు శుక్రవారం గ్రామంలోని పీఏసీఎస్ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఎన్నికల అధికారి వి.సత్యనారాయణ ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించారు. పాలకవర్గానికి కొప్పుల భాస్కర్‌రావు నేతృత్వంలోని ప్యానల్ మాత్రమే నామినేషన్లను దాఖలు చేసింది. 114 ఓట్లకు గానూ 74 మంది ఓటర్లు భాస్కర్‌రావు ప్యానల్‌కు మద్దతుగా నిలిచారు. దీంతో ప్రత్యర్థి వర్గం ప్యానల్ నామినేషన్ కూడా దాఖలు చేసేందుకు ముందుకు రాలేదు. ఒకే ప్యానల్ నుంచి నామినేషన్‌లు దాఖలు కావటంతో పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి సత్యనారాయణ ప్రకటించారు. సొసైటీ అధ్యక్షుడుగా కొప్పుల భాస్కర్‌రావు, ఉపాధ్యక్షుడుగా ఆకునూరు వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా పచ్చిగళ్ల కోటేశ్వరరావు, డైరెక్టర్లుగా తాడితోటి నాగసాంబశివరావు, చాట్ల సుబ్రమణ్యం, మాదు చిన పాములు, కొండి పాముల భాస్కర్‌రావు, ఉప్పులేటి జాన్, గద్దం సామియేలు ఎన్నికయ్యారు. నూతన పాలకవర్గ ప్రతినిధులు ఉయ్యూరు పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథిని మర్యాదపూర్వకంగా కలిశారు. పాలకవర్గాన్ని ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, అగ్రిబోర్డు మాజీ చైర్మన్ నత్తా వెంకటేశ్వరరావు, సర్పంచ్ మేరుగు విజయచంద్రశేఖర్, పార్టీ నాయకులు కాగిత రాజారమేష్, రామయ్య, కలపాల సురేష్, చెన్ను బాబూజీ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే పార్థసారథిని కలిసిన గొడవర్రు సొసైటీ పాలకవర్గ సభ్యులు

మత్స్య సహకార సంఘాలకు నూతన కార్యవర్గాలు

గన్నవరం రూరల్: మత్స్య సహకార సంఘాలు అభివృద్ధితో వాటిపై ఆధారపడ్డ కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుందని జిల్లా మత్స్య సహకార ఉపాధ్యక్షుడు బత్తుల సురేష్ అన్నారు. మండలంలోని ముస్తాబాద, సూరంపల్లి మత్స్య సహకార సంఘాలకు ఆ శాఖ డెవలప్‌మెంట్ అధికారుల సమక్షంలో శుక్రవారం జరిగిన ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ముస్తాబాద సహకార సంఘం ఎన్నికల అధికారిగా ఆ శాఖ ఎఫ్‌డీవో షేక్ బాబు వ్యవహరించారు. మొత్తం 9 మందితో నూతన కార్యవర్గం ఏకగ్రీవమైంది. ముస్తాబాద సహకార సంఘం అధ్యక్షుడిగా కడవకొల్లు ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా జంపన వసంతరావు, కార్యదర్శిగా బొడ్డు రవి, డైరెక్టర్‌లుగా షేక్ మౌలాలి, మాదు వెంకటేశ్వరరావు, కంచర్ల మనోహర్, వేము నాగేశ్వరరావు, కడవకొల్లు శ్రీను, వేము ప్రసాద్ ఎన్నికైనట్లు ప్రకటించారు. సూరంపల్లి మత్స్య సహకార సంఘం ఎన్నికల అధికారిగా గుడివాడ ఎఫ్‌డీవో మంజూష వ్యవహరించారు. సంఘం అధ్యక్షుడిగా గుర్రం నాగులు, ఉపాధ్యక్షుడిగా గండికోట రమణయ్య, కార్యదర్శిగా గొడెం సాంబశివరావు, డైరెక్టర్‌లుగా ఉమ్మడి రవికుమార్, కడవకొల్లు చిన అంకాలరావు, గుర్రం వీరబాబు, తులాబందుల కనక సత్యనారాయణ, లోకం ప్రవీణ్‌కుమార్, షేక్ ఖాన్‌భాషా ఎన్నికైనట్లు మంజూష తెలిపారు. రెండు గ్రామాల నూతన కార్యవర్గాలకు బత్తుల సురేష్ అభినందనలు తెలిపారు. మత్స్య సహకార సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో సహకారం అందిస్తుందని, ఆ సహాయం ఆధారంగా చేపల పెంపకం పై ఆధారపడిన కుటుంబాలకు మేలు చేయాలని చెప్పారు.

గన్నవరం: ది. బుద్దవరం ఫిషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్యానల్ ఏకగ్రీవంగా గెలుచుకుంది. సంఘ అధ్యక్షుడిగా తాడిశెట్టి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా కుప్పాల నాచుపతిరావు, కార్యదర్శిగా తాడిశెట్టి వెంకటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా తాడిశెట్టి వెంకటరామారావు, నక్కా ఏడుకొండలు, కుప్పాల వెంకట్రామయ్య, నక్కా సీతారామయ్య, మెండ్యాల హరినారాయణ, తాడిశెట్టి అప్పారావు ఎన్నికయ్యినట్లు ఎలక్షన్ ఆఫీసర్ వీరంకి సాయికృష్ణ తెలిపారు. నూతన కార్యవర్గాన్ని ఉప సర్పంచ్ వేల్పూరి వెంకటబసవరావు, మత్స్య సహకార సంఘం ఉపాధ్యక్షుడు బత్తుల సురేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు నక్కా రామయ్య, మాజీ ఉప సర్పంచ్ గండికోట దశరాథరామయ్య, మాజీ ఉపసర్పంచ్ గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు. అజ్జంపూడిలో జరిగిన ఫిషర్‌మెన్ సొసైటీ ఎన్నికల్లో అధ్యక్షుడిగా దుడ్ల జ్ఞానేషు, కార్యదర్శిగా అందుగల సాంబయ్య, ఉపాధ్యక్షురాలిగా దుడ్ల కిరీటి విజయం సాధించారు. డైరెక్టర్లుగా దుడ్ల బాలస్వామి, కాటం కృష్ణారావు, మరో నలుగురు ఎన్నికయ్యారని ఎలక్షన్ ఆఫీసర్ డి. పూజిత తెలిపారు. నూతన కార్యవర్గాన్ని సర్పంచ్ కంచర్ల చిన్నా, ఎంపీటీసీ సభ్యురాలు దొడ్ల స్వర్ణకుమారి అభినందించారు.

ప్రతిపక్షాలది రాజకీయ కుట్ర

ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

ఉయ్యూరు: ప్రతిపక్షాలకు ప్రజా గోడు పట్టదని, కుర్చీ కోసం రాజకీయ కుట్రలే లక్ష్యంగా పనిచేస్తున్నారని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. పట్టణంలోని ఏడో వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఎమ్మెల్యే పార్థసారథి ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించి సంక్షేమ బ్రోచర్లను అందజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించి, ప్రతిపక్షాలు చేస్తున్న కుట్రలను తెలియజేశారు. ప్రభుత్వంపై ప్రజాభిప్రాయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా టిడ్కో ఇళ్లు, విద్యుత్ సమస్యలను ప్రజలు వివరించారు. సమస్యలపై ఆయా శాఖల అధికారులతో ఎమ్మెల్యే సమీక్షించారు. టిడ్కో ఇళ్ల సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ జగనన్నపై ప్రతిపక్షాలు కుట్రపూరిత రాజకీయాలు చేస్తున్నాయన్నారు. ఎవరెన్ని ఆరోపణలు, విమర్శలు చేసినా తమ ప్రభుత్వ లక్ష్యం ప్రజా సంక్షేమమే అన్నారు. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు మెచ్చే సంతృప్తికర స్థాయిలో చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని), వైస్ చైర్మన్‌లు సోలే సురేష్ బాబు, అర్షతున్నీసాబేగం, కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, ఏడో వార్డు కౌన్సిలర్ వడుపు గంగాభవాని, ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ జంపాన కొండలరావు, నాయకులు వడుపు కార్తీక్, ఎండి ఈసా, గోరా, రాజులపాటి రామచంద్రరావు, అబ్దుల్ సద్దాం, మహ్మద్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.



ఉయ్యూరు ఏడో వార్డులో సంక్షేమ బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

నైపుణ్యాభివృద్ధితో విద్యార్థులకు ఉపాధి

పెనమలూరు: విద్యార్థులు ఉపాధి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని మైక్రోసాఫ్ట్ సీనియర్ ప్రోగ్రామ్ మేనేజర్ పి.నితీష్ అన్నారు. గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో శుక్రవారం ఇండస్ట్రీ ఎకడమియా సమ్మిట్ ఎమర్జింగ్ టెక్నాలజీస్ అనే అంశం పై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నితీష్ మాట్లాడుతూ ప్రసుత్తం పోటీని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు మానవ, ఉపాధి నైపుణ్యంపై దృష్టి పెట్టాలన్నారు. గూగుల్ మార్కెటింగ్ స్ట్రాటజిస్టు శ్రావణ్‌శ్రీరామ్ మాట్లాడుతూ సాంకేతికపరంగా వస్తున్న నూతన ఆవిష్కరణలపై విద్యార్థులు దృష్టి సారించాలని చెప్పారు. నేడు ప్రధానంగా చాట్ జీపీటీకి సంబంధించి ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ పాత్ర కీలకంగా ఉందన్నారు. రెడ్‌హాట్ సీనియర్ టెక్నికల్ ఇంజినీర్ డాక్టర్ వివేక్ యోగానంద్ మాట్లాడుతూ సైబర్ నేరాలు అరికట్టడానికి సైబర్ భద్రత ఆవశ్యకతను విద్యార్థులు గుర్తించాలని సూచించారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్ కోసం కాలేజీల్లో సమ్మిట్‌లు నిర్వహించితే విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు. హెనొటిక్ టెక్నాలజీ సీఈవో బి.మల్లేశు మాట్లాడుతూ విద్యార్థులు మారుతున్న శాస్త్రసాంకేతిక పరిజానం పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఎంఫసిస్ ఇండియా సీఈవో జె.డేవిడ్, కాలేజీ డైరెక్టర్ రవిప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి, వివిధ విభాగాల అధిపతులు డాక్టర్ ఆర్.సత్యప్రసాద్, డాక్టర్ ఎం.వంశీకృష్ణ, డాక్టర్ శ్రీకాంత్, శ్రీహర్ష, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న మల్లేశు

షూటింగ్ బాల్ పోటీలకు నలంద విద్యార్థులు

కంకిపాడు: రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఈడుపుగల్లు నలంద విద్యార్థులు ఎంపికయ్యారు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ జె.పద్మావతి అభినందించారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ కృష్ణా జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సబ్‌జూనియర్స్ ఎంపిక ప్రక్రియ ఈనెల 7వ తేదీన ఈడుపుగల్లులోని నలంద విద్యానికేతన్‌లో జరిగిందన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారన్నారు. బాలుర విభాగంలో డి. సంతోష్, కె.వర్ధంత్, ఎం.రాజేష్, ఆర్.యువసుజిత్‌బాబు, టి.ప్రణీత్, వి.జయసూర్య, సిరిసెంథిల్, టోని ప్రకాష్, బాలికల విభాగం ఎం.స్తుతి, ఎం.జయశ్రీ, పి.పూజ, జె.సాయిశ్రీ, ఎల్..మోక్షిత అర్హత సాధించారన్నారు. ఈ నెల 12, 13 తేదీల్లో నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో జరిగే రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారని వివరించారు. ఎంపికైన విద్యార్థులను విద్యాసంస్థల అధినేత విజయబాబు ప్రత్యేకంగా అభినందించారు.



రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్‌కు ఎంపికైన విద్యార్థులు

స్పోర్ట్స్ కోటాలో ఇద్దరికి ట్రిపుల్ ఐటీలో సీట్లు



నున్న(విజయవాడరూరల్): సాఫ్ట్‌బాల్ క్రీడలో జాతీయస్థాయిలో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించిన ఇద్దరు విద్యార్థినులకు ట్రిపుల్ ఐటీలో ప్రభుత్వం ప్రవేశం కల్పించిందని నున్న జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వి.భూపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తురకా దివ్యకి నూజివీడు ట్రిపుల్ ఐటీ, లేళ్ళ పూర్ణశ్రీ కి శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో ప్రభుత్వం స్పోర్ట్స్ కోటాలో సీట్లు కేటాయించిందన్నారు. నున్న జిల్లా పరిషత్ హైస్కూల్లో వీరిద్దరు గత విద్యాసంవత్సరంలో పదో తరగతి పరీక్షలు రాసి ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు. క్రీడల్లో రాణిస్తే ఉన్నత విద్యలో ప్రవేశానికి ప్రత్యేక రిజర్వేషన్లు ఉంటాయన్నారు. అలాగే ఈ ఏడాది ప్రతి పాఠశాల నుంచి కనీసం పదిమంది విద్యార్థులు రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడల్లో పాల్గొనాల్సి ఉందన్నారు. చదువులో అద్భుతంగా రాణించిన ఇద్దరు విద్యార్థులకు ట్రిపుల్ ఐటీ నూజివీడు క్యాంపస్ లో సీట్లు పొందగా, మరో ఇద్దరికి స్పోర్ట్స్ కోటాలో మరో ఇద్దరికి సీట్లు లభించినట్లు తెలిపారు.

దోమల నిర్మూలన చర్యలతో ప్రజారోగ్యం

కంకిపాడు: దోమల నిర్మూలన చర్యలతో ప్రజారోగ్య పరిరక్షణ సాధ్యమని ఉప్పలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుందర్‌కుమార్ అన్నారు. ఉప్పలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అన్ని గ్రామ సచివాలయాల్లో శుక్రవారం ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాలు నిర్వహించారు. డాక్టర్ సుందర్‌కుమార్ మాట్లాడుతూ వర్షాకాలంలో ఇంటి పరిసరాల్లో మురుగు నిలిచిపోయి దోమల ఉత్పత్తి చెందే అవకాశం ఉందన్నారు. దోమల వల్ల కలిగే వ్యాధులను ప్రజలకు వివరించి అవగాహన కల్పించాలన్నారు. నిరంతరం ఇంటింటి సర్వే పూర్తి చేసి ప్రజారోగ్య రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. గొడవర్రు గ్రామంలో ఐదురోజులుగా ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. దోమల నిర్మూలనకు అబెట్, మలాథియన్ మందు పిచికారీ పనులు చేపట్టారు. సర్వేలో ఎంపీహెచ్‌ఈఓ కృష్ణారావు, గ్రామసర్పంచ్ మేరుగు విజయ చంద్రశేఖర్, కార్యదర్శి ఎంపిఎస్ ప్రసాద్, హెల్త్‌సూపర్‌వైజర్‌లు బి.వెంకటేశ్వరరావు, రామారావు, హెల్త్ అసిస్టెంట్‌లు మణికాంత్, గోపాల్, శ్రీధర్, కెనడీ, రాచమళ్ల శ్యాంప్రసాద్, ఏఎన్ఎం యేసుమేరీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఇంటి పరిసరాల్లో నిలిచిన నీటిని తొలగిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌గా వీర్రాజు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండల వ్యవసాయ సలహా మండలి నూతన చైర్మన్‌గా కె.సీతారామపురానికి చెందిన పడకల వీర్రాజు నియమితులయ్యారు. మహాత్మగాంధీ నగర్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన మండల వ్యవసాయ సలహా మండలి సమావేశంలో చైర్మన్‌గా పడకల వీర్రాజు ప్రమాణ స్వీకారం చేశారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో చురుగ్గా పని చేస్తున్న వీర్రాజు ప్రస్తుతం పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. ప్రమాణ స్వీకారం అనంతరం పార్టీ నాయకులు వీర్రాజును సత్కరించారు. ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఆవిర్నేని శేషగిరిరావు, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, ఎంపీడీవో కె.జోగేశ్వరరావు, మండల వ్యవసాయాధికారి జొన్నలగడ్డ భవాని, మండల ఉద్యాన అధికారి హరిచంద్, మాజీ సర్పంచ్ మయూర వెంకటేశ్వరరావు తదితరులున్నారు.



వీర్రాజును సత్కరిస్తున్న దృశ్యం

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం హెచ్‌సీయల్ సంస్థ 47వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మొక్కలు నాటారు. వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో హెచ్‌సీయల్ ఫౌండేషన్, రోటరీక్లబ్ ఆఫ్ అమరావతి సహకరంతో విజయవాడ హెడ్ శివప్రసాద్ చేతుల మీదుగా మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. దేశవ్యాప్తంగా 47 వేల మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. పాఠశాల హెచ్‌ఎం డి. ఝాన్సీరాణి అధ్యక్షతన హెచ్‌సీయల్ ఫౌండేషన్ ప్రోగ్రామ్ అధికారి బీ. శ్రీనివాసులు, హెచ్ ఆర్ రాజేష్, రోటరీక్లబ్ ప్రతినిధులు డాక్టర్ మెరోజ్, డాక్టర్ సుదీప్తి, డాక్టర్ అభినయ తదితరులున్నారు.



మొక్కలు నాటుతున్న శివప్రసాద్

అమరుల త్యాగాలు అజరామరం

పెనమలూరు: దేశం కోసం అమరవీరులు చేసిన త్యాగాలు ఎన్నటికీ మరవరాదని ఎంపీడీఓ సునీతాశర్మ అన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా చోడవరం గ్రామంలో శుక్రవారం నాభూమి-నాదేశం, నేలతల్లికి నమస్కారం-వీరులకు వందనం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ వద్ద శిలాఫలకం పై అమరవీరులు, దేశ నేతల పేర్లు రాశారు. అమరవీరులకు ఘన నివాళులర్పించారు. జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తి గీతాలు ఆలపించారు. పర్యావరణం పరిరక్షణకు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సునీతాశర్మ మాట్లాడారు. సర్పంచ్ కాకర్ల వెంకటరత్నం, ఈవోపీర్డీ కోరా శ్రీనివాసరావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి బొమ్మసాని శ్రీనివారావు, టీఏ ఆర్.వెంకటేశ్వరరావు, మార్కెట్ యార్డు డైరెక్టర్ మండూరు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యూరు: స్వాతంత్రోద్యమ ఘట్టంలో అమరుల త్యాగం అజరామరం అని తహసీల్దార్ మస్తాన్ అన్నారు. మండలంలోని కలవపాముల గ్రామంలో నా భూమి-నా దేశం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. స్వాతంత్రోద్యమ వీరుల స్ఫూర్తిగా నిర్మించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించి మొక్కలు నాటారు. పంచ ప్రాణ ప్రతిజ్ఞ చేశారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పొనుగుమాటి బాలస్వామి, ఆర్ఐ శ్రీనివాసరావు, గ్రామస్తులు పాల్గొన్నారు. మండలంలోని పెద ఓగిరాల గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఎంఈఓ సుధారాణి, సర్పంచ్ త్రిపురం లక్ష్మి, ఎంపీటీసీ గుంటక నాగిరెడ్డి పాల్గొన్నారు. కడవకొల్లులో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీఓ విమాదేవి, సర్పంచ్ సుధ, ఎంపీటీసీ శారద, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

సైనికుల త్యాగాలు వెలకట్టలేనివి

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రాణాలను సైతం లెక్కచేయకుండా దేశ సరిహద్దుల్లో రక్షణ విధులు నిర్వహిస్తున్న సైనికుల త్యాగాలు వెలకట్టలేనివని బాపులపాడు వైస్ ఎంపీపీ పందు రాణి అన్నారు. బాపులపాడు మండలం పెరికీడులో ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా 'నా భూమి-నా దేశం' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించి, ప్రతిజ్ఞ చేశారు. అనంతరం గ్రామంలో మొక్కలు నాటి, జాతీయ జెండాను ఎగురవేశారు. గ్రామానికి చెందిన మాజీ సైనికుడు దుప్పల రంగారావును సత్కరించారు. పంచాయతీ రాజ్ ఏఈ డి.జయరాజు, సర్పంచ్ పల్లపోతు జాన్‌ప్రకాష్, మాజీ సర్పంచ్ తవ్వా హేమేశ్వర నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గన్నవరం రూరల్: మండలంలోని జక్కులనెక్కలం, కొత్తగూడెం గ్రామాల్లో శుక్రవారం నా భూమి, నాదేశం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శిలాఫలకాలు ఆవిష్కరించి పంచప్రాణ ప్రతిష్ట నిర్వహించారు. అమరవీరుల పట్ల ప్రతి ఒక్కరూ గౌరవం చాటాలని కొత్తగూడెం సర్పంచ్ తూంపాటి రాంబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యురాలు చిలకపాటి పద్మ, పంచాయితీ కార్యదర్శి బాపూజీ, సచివాలయం సిబ్బంది మొక్కలు నాటారు. జక్కులనెక్కలం సర్పంచ్ మాకుల చిరంజీవి, పంచాయితీ కార్యదర్శి పొట్లూరి వెంకట మురళీ కృష్ణ, ఏపీవో సత్యప్రియ, ఉపసర్పంచ్ దేవరపల్లి కళ్యాణి, అరవింద్, సచివాలయం కార్యదర్శి బెజవాడ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ఉంగుటూరు: ఆజాదీకా అమృత మహోత్సవ్‌లో భాగంగా నా భూమి- నాదేశం-నేల తల్లికి నమస్కారం- వీరులకు వందనం కార్యక్రమం తేలప్రోలు, ముక్కపాడు, కొయ్యగూరపాడు, పొట్టిపాడు, ఎన్ఎ పేట, నాగవరప్పాడు, మధిరపాడు గ్రామాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో స్వాతంత్ర సమరయోధులు పేర్లుతో ఏర్పాటు చేసిన శిలాఫలకాలను ప్రజా ప్రతినిధులు అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఆ శిలాఫలకాల వద్ద అందరు మట్టిని చేతిలో పట్టుకుని పంచ ప్రాణ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం వసుదకు వందనంలో భాగంగా మొక్కలు నాటారు.



తేలప్రోలులో నా భూమి-నాదేశం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు



చోడవరంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీఓ సునీతాశర్మ, సర్పంచ్ కాకర్ల వెంకటరత్నం

దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలి...

కంకిపాడు: దేశ ప్రగతి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ టీ.ఉదయ్‌భాస్కర్ కోరారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మండలంలోని పునాదిపాడు జెడ్పీ పాఠశాలలో నా భూమి-నా దేశం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, శిలాఫలకం వద్ద మట్టిని చేత పట్టి ప్రతిజ్ఞ చేశారు. విద్యార్థులతో మొక్కలు నాటించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ముసిబోయిన వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ మార్తమ్మ, ఈఓ బి.వెంకటేశ్వరరావు, హెచ్ఎం ఆలపాటి వెంకటేశ్వరరావు, వెలుగు ఏపీఎం సాంబశివరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వేల్పూరులో నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నాగరాజు, సర్పంచ్ చెన్నుబోయిన శివనాగేంద్రమ్మ, ఉపాధి హామీ పథకం ఏపీఓ బసవరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు చెన్నుబోయిన సుబ్బారావు, కె.సాంబశివరావు, పాలకవర్గ సభ్యులు తితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం కె.సీతారామపురంలోని రైతుభరోసా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులు శుక్రవారం అవగాహన కల్పించారు. ఎగ్ అమైనో యాసిడ్, పంచగవ్య తయారు చేసే విధానాలను గ్రామ వ్యవసాయ సహాయకుడు పూర్ణచంద్రరావు, ప్రకృతి వ్యవసాయదారురాలు చందన రామలక్ష్మీ రైతులకు వివరించారు. వీటి వాడకం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు తెలియజేశారు. ప్రతి ఇంట్లో మహిళలు కిచెన్ గార్డెన్ నిర్వహించాలని సూచించారు. ఇంటి పెరట్లోనే కూరగాయాల మొక్కలను పెంచటం ద్వారా ఆరోగ్యకరమైన ఆహారాన్ని పొందవచ్చని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జి నాగలక్ష్మీ, ఐసీఆర్పీలు లీల రంగమ్మ, దుర్గాంబ, మహిళా రైతులు తానీయా లలిత, అడపా రాధిక, ఏనికేపల్లి నాగమల్లేశ్వరి, లలిత పాల్గొన్నారు.